
## ఐపీఎల్ ముచ్చట్లు..

### కింగ్ కోహ్లీ ఈజ్ బ్యాక్




ముంబై: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ వచ్చేశాడు. వ్యక్తిగత కారణాలతో ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమైన కోహ్లీ..ఆదివారం లండన్ నుంచి ముంబైకి చేరుకున్నాడు. త్వరలో మొదలుకాబోతున్న ఐపీఎల్ సీజన్ కోసం స్వదేశానికి వచ్చిన విరాట్..ఆర్‌సీబీతో కలువనున్నాడు. ఈ విషయాన్ని లీగ్ ప్రసారదారు స్టార్‌స్పోర్ట్స్ తమ అధికారిక ట్విటర్‌లో పేర్కొంది. తన భార్య అనుష్క శర్మ బాబు(అకాయ్)కు జన్మనివ్వడంతో కోహ్లీ..జాతీయ జట్టు నుంచి విరామం తీసుకున్నాడు. గత 16 ఏండ్లుగా ఆర్‌సీబీ తరఫున కోహ్లీ.. ఈసారైనా ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడాలన్న పట్టుదలతో కనిపిస్తున్నాడు. ఈ నెల 22న లీగ్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్‌తో ఆర్‌సీబీ తలపడుతుంది.

### హెడ్ వచ్చేశాడు..



హైదరాబాద్: ఐపీఎల్ 17వ సీజన్ కోసం ఆస్ట్రేలియా హార్డ్ హిట్టర్ ట్రావిస్ హెడ్ భారత్‌కు వచ్చేశాడు. ఈ నెల 22 నుంచి మొదలవుతున్న ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) తరఫున హెడ్ బరిలోకి దిగబోతున్నాడు. ఇటీవల జరిగిన ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌ను ఆస్ట్రేలియా గెలువడంలో కీలకంగా వ్యవహరించిన హెడ్..ప్యాట్ కమిన్స్ సారథ్యంలో ఆడబోతున్నాడు. సరిగ్గా ఏడేండ్ల క్రితం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ఆడిన హెడ్..ఇప్పుడు హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తన ఆగమనంపై హెడ్ మాట్లాడిన వీడియోను ఎస్ఆర్‌హెచ్ తమ అధికారిక ట్విటర్‌లో పోస్ట్ చేసింది. 'లీగ్‌లో ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. జట్టు మెరుగ్గా కనిపిస్తున్నది. సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకున్నాను. సొంత ప్రేక్షకుల మధ్య ఆడేందుకు ఆసక్తితో ఉన్నాను. జట్టు తరఫున వీలైనన్ని పరుగులు సాధించి విజయాల్లో కీలకమవుతాను' అని పేర్కొన్నాడు. ఈసారి హైదరాబాద్ జట్టుకు న్యూజిలాండ్ దిగ్గజం డానియల్ వెటోరీ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. చివరిసారి 2016లో టైటిల్ గెలిచిన హైదరాబాద్ మరోమారు అదే ప్రదర్శన పునరావృతం చేయాలని చూస్తున్నది.

### అయ్యర్ ఆగయా..



కోల్‌కతా: కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్..ఐపీఎల్ కోసం కోల్‌కతాలో ఆదివారం అడుగుపెట్టాడు. వెన్నునొప్పి గాయంతో లీగ్‌లో కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశముందన్న వార్తలను తోసిపుచ్చుతూ అయ్యర్..కోల్‌కతా నైట్‌రైడర్స్ క్యాంప్‌లో అడుగుపెట్టాడు. కెప్టెన్ అయ్యర్ వచ్చేశాడంటూ కేకేఆర్ తమ సోషల్‌మీడియాలో ఫొటోలు పోస్ట్ చేసింది. గాయం కారణంగా గత సీజన్‌కు పూర్తిగా దూరమైన అయ్యర్ ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ గాయంతో చివరి మూడు టెస్టులకు దూరమయ్యాడు. దీనికి తోడు రంజీ ట్రోఫీలో క్వార్టర్స్‌లో ఆడలేకపోయిన ఈ ముంబైకర్..సెమీస్, ఫైనల్లో జట్టులోకి వచ్చాడు. లీగ్ తొలి మ్యాచ్‌లో ఈ నెల 23న కోల్‌కతా, హైదరాబాద్‌తో ఆడుతుంది.



**ప్రాక్టీస్..ప్రాక్టీస్**

డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్.. సిరీయస్‌గా ప్రాక్టీస్ చేస్తున్నది. లీగ్ తొలి మ్యాచ్‌లో బెంగళూరును ఎదుర్కొబోతున్న చెన్నై అందుకు తగ్గట్లు సిద్ధమవుతున్నది. ఆదివారం ప్రాక్టీస్ సెషన్‌లో కెప్టెన్ ధోనీ, జడేజా చెమటోడ్చారు.

# చాంప్ ఆర్‌సీబీ

**తొలిసారి డబ్ల్యూపీఎల్ టైటిల్ కైవసం • ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం • శ్రేయాంక, మిలోనెక్స్ విజృంభణ**



**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) కప్ కల నెరవేరింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఆర్‌సీబీ..డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను తొలిసారి సగర్వంగా ముద్దాడింది. 30వేల మంది ప్రేక్షకుల మధ్య జరిగిన ఫైనల్ ఫైట్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తుచేస్తూ లీగ్ విజేతగా నిలిచింది. శ్రేయాంకపాటిల్, మిలోనెక్స్ విజృంభణతో ఢిల్లీ 113 పరుగులకే కుప్పకూలింది. షెఫాలీవర్మ మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. స్వల్ప లక్ష్యఛేదనలో ఎలీస్ పెర్రీ, సోఫీ డివైన్ రాణించడంతో ఆర్‌సీబీ అలవోక విజయాన్నందుకుంది. మొత్తంగా 'ఈ సాలా కప్ నమదే' అన్న స్లోగన్‌ను ఆర్‌సీబీ అమ్మాయిలు చేతల్లో చూపెట్టగా, ఇక అబ్బాయిల వంతు మిగిలింది.**

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) చాంపియన్‌గా నిలిచింది. టైటిల్ ఫైట్‌లో నిలిచిన తొలిసారే టైటిల్‌ను దక్కించుకుంది. ఆదివారం జరిగిన తుదిపోరులో ఆర్‌సీబీ 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత ఢిల్లీ 18.3 ఓవర్లలో 113 పరుగులకు కుప్పకూలింది. శ్రేయాంక పాటిల్ (4-12), సోఫీ మిలోనెక్స్(3-20)..ఢిల్లీ పతనాన్ని శాసించారు. షెఫాలీ వర్మ(44), మెగ్ ల్యానింగ్ (23) ఆకట్టుకోగా, రోడ్రిగ్స్(0), కాప్సె (0), కాప్ (8), జొనాసెన్ (3), రాధాయాదవ్ (12) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బెంగళూరు 19.3 ఓవర్లలో 115-2 స్కోరు చేసింది. ఎలీస్ పెర్రీ(35 నాటౌట్), డివైన్(32) రాణించారు. శిఖా పాండే, మణి ఒక్కో వికెట్ తీశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా మిలోనెక్స్, 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా దీప్తిశర్మ నిలిచారు.

**ఢిల్లీ ధమాల్:**

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ తమదైన రీతిలో దూకుడైన ఆటతీరు కొనసాగించింది. ఓపెనర్లు కెప్టెన్ మెగ్ ల్యానింగ్, షెఫాలీవర్మ..బెంగళూరు బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటూ ఆది నుంచే చెలరేగారు. మిలోనెక్స్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో

| ప్రైజ్ మనీ | | |
|---|---|---|
| విజేత: | ఆర్‌సీబీ: | 6 కోట్లు |
| రన్నరప్: | ఢిల్లీ: | 3 కోట్లు |

బౌండరీల ఖాతా తెరిచిన షెఫాలీ..రేణుకాసింగ్‌ను కూడా అరుసుకుంది. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో షెఫాలీ భారీ సిక్స్ బాదితే..తానేం తక్కువ కాదన్నట్లు ల్యానింగ్ వరుసగా రెండు ఫోర్లతో విరుచుకుపడింది. అదే జోరు కొనసాగిస్తూ పెర్రీ వేసిన మరుసటి ఓవర్లోనూ షెఫాలీ..ఓ సిక్స్, ఫోర్‌తో స్కోరుబోర్డును పరుగులు పెట్టించింది. మరో ఎండ్‌లో ల్యానింగ్ కూడా జత కలువడంతో పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ వికెట్ కోల్పోకుండా 61 పరుగులు చేసింది. వేర్‌హమ్ వేసిన ఏడో ఓవర్లో ఢిల్లీ మూడు పరుగులకే పరిమితం కాగా, మిలోనెక్స్ వేసిన ఎనిమిదో ఓవర్ ఢిల్లీ వికెట్ల పతనానికి తెరతీసింది. మిలోనెక్స్ తొలి బంతికే షెఫాలీ..క్యాచ్ ఔట్ కాగా, బంతి తేడాతో జెమీమా రోడ్రిగ్స్(0), క్యాప్సె(0) ఇద్దరు క్లీన్ బౌల్డ్ అయ్యారు. అప్పటి వరకు వికెట్ కోల్పోకుండా భారీ స్కోరు దిశగా సాగుతున్నట్లు కనిపించిన ఢిల్లీ..ఒకే ఓవర్లో మూడు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. టాపార్డర్‌ను మిలోనెక్స్ కూలిస్తే.. మిడిలార్డర్‌ను శ్రేయాంక పాటిల్ పని పట్టింది. ల్యానింగ్‌ను శ్రేయాంక ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ పంపింది. ఆశా శోభన 14వ ఓవర్లో కాప్(8), జొనాసెన్ (3)ను ఔట్ చేసి పోటీలోకి వచ్చింది. ఆ తర్వాత మిన్నుమణి (5), రాధా యాదవ్ (12), అరుంధతిరెడ్డి (10), తానియా భాటియా (0) వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి స్వల్ప స్కోరుకు పరిమితమైంది. ఒక దశలో 61-0 స్కోరుతో మెరుగ్గా కనిపించిన ఢిల్లీ..49 పరుగుల తేడాతో 10 వికెట్లు కోల్పోయింది. ఈ మ్యాచ్‌కు దాదాపు 30వేల మంది ప్రేక్షకులు స్టేడియానికి తరలివచ్చారు.

| | |
|---|---|
| **1** | ఫ్రాంచైజీ పరంగా ఆర్‌సీబీకి ఇది తొలి టైటిల్. |
| **9** | ఢిల్లీతో ఫైనల్లో ఆర్‌సీబీ స్పిన్నర్లు తీసిన వికెట్లు. డబ్ల్యూపీఎల్‌లో ఒక జట్టులో స్పిన్నర్లు పడగొట్టిన అత్యధిక వికెట్లుగా రికార్డుల్లోకెక్కింది. |

**ఆడుతూ పాడుతూ:**

ఢిల్లీ నిర్దేశించిన స్వల్ప లక్ష్యఛేదనను బెంగళూరు ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్ల స్మృతి మంధన, సోఫీ డివైన్ మెరుగైన శుభారంభం అందించారు. ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలతో అలరించారు. తొలి వికెట్‌కు 49 పరుగులు జోడించిన ఆర్‌సీబీ..పెర్రీ సాధికారిక ఇన్నింగ్స్‌తో అలవోకగా గెలిచింది. మంధన ఔటైనా.. పెర్రీతో కలిసి రీచా ఘోష్(17 నాటౌట్) జట్టును గెలిపించి సంబురాల్లో నిలిపింది.

**సంక్షిప్త స్కోర్లు**

**ఢిల్లీ:** 18.3 ఓవర్లలో 113 ఆలౌట్ (షెఫాలీ వర్మ 44, ల్యానింగ్ 23, శ్రేయాంక 4-12, మిలోనెక్స్ 3-20), **బెంగళూరు:** 19.3 ఓవర్లలో 115-2(పెర్రీ 35 నాటౌట్, డివైన్ 32, శిఖాపాండే 1-11, మణి 1-12).


### రన్నరప్ రష్మిక



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండోర్ వేదికగా జరిగిన ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో రాష్ట్ర యువ టెన్నిస్ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రష్మిక 3-6, 2-6తో రెండో సీడ్ డలైలా జకుసోవిచ్(స్లోవేనియా) చేతిలో ఓటమిపాలైంది. ఇదే టోర్నీలో వైదేహి చౌదరీతో కలిసి రష్మిక డబుల్స్ టైటిల్ గెలిచిన సంగతి తెలిసిందే.


### గుల్వీర్ రికార్డు పరుగు

**16 ఏండ్ల ఫీట్ బద్దలు**



న్యూఢిల్లీ: ఆసియా గేమ్స్ కాంస్య విజేత గుల్వీర్‌సింగ్ మరోమారు సత్తాచాటాడు. కాలిఫోర్నియా వేదికగా పారిస్ ఒలింపిక్స్ అర్హత టోర్నీలో గుల్వీర్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఆదివారం జరిగిన పురుషుల 10,000 మీటర్ల రేసును గుల్వీర్ 27.41.81 సెకన్ల టైమింగ్‌తో ముగించి రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో 16 ఏండ్ల క్రితం సురేంద్రసింగ్ నెలకొల్పిన రికార్డు (28.02.89సె)ను గుల్వీర్ అధిగమించాడు. 20 సెకన్ల తేడాతో కొత్త రికార్డు అందుకున్న గుల్వీర్..పారిస్ ఒలింపిక్స్ అర్హత టైమింగ్ (27.00.00)ను అందుకోలేకపోయాడు. మరోవైపు భారత్‌కే చెందిన కార్తీక్‌కుమార్ (28.01.90సె) తొమ్మిదో స్థానంలో నిలువగా, అవినాశ్ సాబ్లే 6వేల మార్క్ వద్ద పరుగును ముగించాడు. మహిళల విభాగంలో పారుల్ చౌదరి (32.02.08) పారిస్ విశ్వ క్రీడలకు అర్హత సాధించలేకపోయింది.

---



### శనివారం వస్తే డిష్యుం డిష్యుం..

యాక్షన్ ప్యాక్డ్ కథాంశంతో హీరో నాని నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. కోపాన్ని శనివారానికి మాత్రమే పరిమితం చేసిన ఓ వైరైటీ కుర్రాడి కథ ఇది. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి కలిసి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా నడుస్తున్నది. చిన్న విరామం తర్వాత నేటి నుంచి కొత్త షెడ్యూల్ మొదలుకానుంది. నానితోపాటు ఇతర తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు తెరకెక్కిస్తారని నిర్మాతలు చెప్పారు. నానితో దర్శకుడు వివేక్ ఆత్రేయ చేసిన తొలి సినిమా 'అంటే సుందరానికి'. అందులో నాని సాఫ్ట్‌గా కనిపించారు. ఆ సినిమాకు పూర్తి భిన్నంగా ఇందులో కనిపిస్తాడని నిర్మాతలు తెలిపారు. ప్రియాంక అరుల్‌మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మురళి జి., సంగీతం: జేక్స్ బిజోయ్.



### నచ్చినట్టు బతికమని చెప్పే సినిమా

అశిష్‌గాంధీ, అశోక్, వర్ష, హ్రితిక ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'హద్దులేదురా'. రాజశేఖర్ రావి దర్శకుడు. వీరేష్ గాజుల బళ్లారి నిర్మాత. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి అగ్ర దర్శకుడు గోపీచంద్ మలినేని, ఆధ్యాత్మికవేత్త రాధా మనోహర్ దాస్ అతిథులుగా వచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'జీవితాన్ని నచ్చినట్టు బతకాలని చెప్పడమే ప్రధాన ఇతివృత్తంగా ఈసినిమా చేశాం. అందుకే 'హద్దులేదురా' అనే టైటిల్ పెట్టాం. నటీనటులు, సాంకేతికనిపుణులంతా అద్భుతంగా సహకరించారు.' అని దర్శకుడు చెప్పారు. కథపై నమ్మకంతో ఈ సినిమా చేశామని, ఈనెల 21న అందరూ థియేటర్లకు వచ్చి సినిమా చూడాలని నిర్మాత కోరారు. ఇంకా తనికెళ్లభరణి, అశిష్‌గాంధీ తదితరులు కూడా మాట్లాడారు.

**చిత్రం**

### గర్వంగా ప్రేక్షకుల ముందుకొస్తా



జాతీయ ఉత్తమనటి కృతీసనన్ నిర్మాతగా మారింది. బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్ పేరిట ఓ నిర్మాణ సంస్థను నెలకొల్పి.. అందులో తొలి ప్రయత్నంగా 'దో పత్తీ' పేరుతో చిత్రాన్ని నిర్మించింది. నిర్మాతగా తన అనుభవాలను ఇటీవల అభిమానులతో పంచుకున్నారు కృతిసనన్. 'నాపై నాకు నమ్మకాన్ని పెంచిన సినిమా 'దో పత్తీ'. నటనతో పాటు నిర్మాణంలో కూడా రాణించగలనన్న ఆత్మవిశ్వాసం ఈ సినిమా నాకు ఇచ్చింది. సవాల్‌గా తీసుకొని ఈ సినిమాను నిర్మించాను. స్క్రిప్ట్ దగ్గర్నుంచి అన్ని విభాగాల్లో భాగం అయ్యాను. ఫలితంగా బడ్జెట్‌ని అర్థం చేసుకోగలిగాను. రోజుకు 16 నుంచి 17 గంటలు కేవలం ఈ సినిమా కోసమే పనిచేశాను. త్వరలోనే గర్వంగా ప్రేక్షకుల ముందుకు తెస్తా.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది కృతీసనన్. ప్రస్తుతం ఈ సినిమాతోపాటు ఈ అందాలభామ చేతిలో 'క్రూ' అనే సినిమా కూడా ఉంది. ఇందులో కరీనా కపూర్, టబు లతో కలిసి నటిస్తున్నది కృతి. ఈ నెల 29న ఈ సినిమా విడుదల కానుంది.

**కార్తికేయుని అడ్వెంచరస్ జర్నీ..**

### ముచ్చటగా మూడోసారి



'కార్తికేయ' తెలుగులో హిట్టయితే.. 'కార్తికేయ-2' తెలుగుతోపాటు బాలీవుడ్‌లో కూడా రికార్డుల మోత మోగించేసింది. తెలుగు సినిమా గౌరవాన్ని పెంచిన కథల్లో 'కార్తికేయ' ఫ్రాంచైజీని కూడా చెప్పుకోవాలి. అందుకే.. అ అద్భుతాన్ని కొనసాగిస్తూ 'కార్తికేయ-3'ని ఖరారు చేసేశాడు హీరో నిఖిల్ సిద్ధార్థ్. దర్శకుడు చెందు మొడేటి మూడోసారి మ్యాజిక్ చేయడానికి రెడీ అయ్యారు. ఈ సినిమాకు చెందిన స్క్రిప్ట్ వర్క్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మొదటి రెండు భాగాలను మించే స్థాయిలో ఈ మూడో భాగం ఉండబోతున్నదని, స్పాన్, స్కేల్ పరంగా చాలా బిగ్గర్‌గా ఈ సినిమా ఉండబోతున్నదని చందు మొండేటి నమ్మకంగా చెప్పారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలోనే తెలియరానున్నాయి.

### ఒసేయ్ అరుంధతి..



ఇంటి బాధ్యతల్ని మోస్తున్న అరుంధతి అనే ఓ ఇల్లాలు సత్యనారాయణవ్రతం చేసుకోవాలనుకుంటుంది. అప్పుడే అనుకోకుండా తనకు ఓ సమస్య వచ్చిపడుతుంది. ఆ సమస్యనుంచి తనతోపాటు ఇంటి పరువును ఎలా కాపాడుకుందనే కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'ఒసేయ్ అరుంధతి'. వెన్నెల కిశోర్, కమల్‌కామరాజు, మోనిక ప్రధానపాత్రధారులు. విక్రాంత్‌కుమార్ దర్శకుడు. గూడూరు ప్రణయ్ రెడ్డి నిర్మాత. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ జరుపుకుంటున్నది. ఇదొక ఫ్యామిలీ థ్రిల్లర్ అని, త్వరలోనే సినిమాను విడుదల చేయనున్నామని నిర్మాత తెలిపారు. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ ప్రధానంగా సాగే ఈ సినిమా కుటుంబసమేతంగా చూడదగ్గ విధంగా ఉంటుందని దర్శకుడు చెప్పారు. పృధ్వీరాజ్, చిత్రంశ్రీను, అరియానా గ్లోరీ, సునీతా మనోహర్, టార్జాన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిచైతన్య మాటేటి, సంగీతం: సునీల్‌కశ్యప్.



### అసలు ఉద్దేశం వేరు

'ఇందులో నా పేరు డా.వినయ్ గుమ్మాడి. పీహెచ్‌డీ చేయాలని ఫ్రెండ్స్‌తో కలిసి ఉస్మానియాలో చేరతాం. కానీ అసలు ఉద్దేశ్యం మాత్రం వేరు. అక్కడ వచ్చే స్టయిఫండ్, ఉచిత హాస్టల్ సౌకర్యం వీటికోసమే మా పీహెడ్‌డీ. నేను సైన్స్‌ని నమ్ముతాను. మిగతా ఇద్దరూ మంత్రాలు, తంత్రాలను నమ్ముతారు. ' అని ప్రియదర్శి అన్నారు. శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణతో కలిసి ఆయన నటించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. వి.సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ నెల 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రియదర్శి చెబుతూ. 'కథ నచ్చింది. శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ కాంబినేషన్ అనగానే ఆసక్తి పెరిగింది. బలమైన నిర్మాణ సంస్థ. అన్నీ బావున్నాయి కాబట్టే ఇందులో భాగం అయ్యాను. ఇందులో మేం ముగ్గురం తింగరి పనులు చేసి సమస్యల్లో ఇరుక్కుంటాం. వాటి నుంచి ఎలా బయటపడ్డామనేది కథ. ఖర్చుకు నిర్మాతలు వెనుకాడలేదు. ఓ పాటకోసం పూనేకు 70కిలోమీటర్ల దూరంలో ఉన్న 'థోర్' అనే ప్యాలస్‌కు వెళ్లాం. సాంకేతికంగా నెక్స్ట్ లెవల్ సినిమా ఇది. హీరోయిన్ల పాత్రలకు కూడా ప్రాధాన్యత ఉంటుంది. దర్శకుడిగా శ్రీహర్షాకు స్టార్ స్టేటస్‌ను తెచ్చే సినిమా అవుతుంది' అని చెప్పారు ప్రియదర్శి.

### అందుకే నిర్మాతనయ్యా



'ప్రతిభ ఉండి కూడా అవకాశాలు రాక ఇబ్బందులు పడుతున్న చాలామంది యంగ్ టాలెంట్‌ని నేను చూశాను. సహాయ దర్శకుడిగా కెరీర్ మొదలుపెట్టిన నాకు దర్శకుడ్ని కావడానికి ఏడేళ్లు పట్టింది. నాగార్జునగారి రూపంలో అదృష్టం నన్ను వరించింది. అందుకే.. నాలాంటి దర్శకులకోసం నేను నిర్మాతగా మారాను.' అని దర్శకుడు కల్యాణ్‌కృష్ణ అన్నారు. భారత్‌రాజ్, దివి జంటగా నవీన్‌గాంధీ దర్శకత్వంలో కల్యాణ్‌కృష్ణ నిర్మించిన చిత్రం 'లంబసింగి'. ఈ నెల 15న విడుదలైన ఈ సినిమా సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. నమ్మి అవకాశం ఇచ్చిన కల్యాణ్‌కృష్ణగారికీ, సహకరించిన యూనిట్‌సభ్యులకు ధన్యవాదాలని దర్శకుడు అన్నారు. ఒక తెలుగమ్మాయి కావాలని నన్ను ఈ సినిమాకు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని, తెలుగు అమ్మాయిలను ప్రోత్సహిస్తున్న కల్యాణ్‌కృష్ణగారికి కృతజ్ఞతలని కథానాయిక దివి అన్నారు. ఇంకా హీరో భరత్‌రాజ్, నటుడు మాధవ్ చిలుకూరి, సంగీత దర్శకుడు ఆర్.ఆర్.ధ్రువన్ కూడా మాట్లాడారు.

### రెండుమూడు యానిమల్స్ చేసుకో మాకేంటి?





దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా, రచయిత జావేద్‌అక్తర్‌ల మాటల యుద్ధం చల్లారేలా లేదు. విడుదలైన కొత్తలో 'యానిమల్' సినిమాను ఉద్దేశించి జావెద్ అక్తర్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే 'స్త్రీలను కించపరుస్తూ తీసిన ఇలాంటి సినిమాలు విజయం సాధించడం సమాజానికి ప్రమాదకరం.' అంటూ ఓ కార్యక్రమంలో ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై వెంటనే దీటుగా స్పందించారు సందీప్‌రెడ్డి. 'జావెద్ సార్ రాసిన సినిమాల్లో ఇప్పటివరకూ ఒక్క అసభ్యకర సన్నివేశం నేను చూడలేదు. రచయితగా ఆయన్ను విమర్శించే స్థాయి నాది కాదు. అయితే.. ఆయన మనవడు ఫర్హాన్ అక్తర్ 'మీర్జాపూర్' అనే వెబ్ సిరీస్ తీశాడు. అందులో అన్నీ బూతులే. మరి ఈ నీతులేవో తన తనయుడికి కూడా చెబితే బావుండేది కదా.' అని సందీప్ కౌంటర్ ఇచ్చారు. ఈ కౌంటర్‌తో గొడవ చల్లారిందిలే అని అందరూ భావించిన సమయంలో.. మళ్లీ సందీప్‌పై జావెద్ కౌంటర్ ఎటాక్ చేశారు. 'నా కెరీర్‌లో ఎక్కడా ఒక్క అసభ్య సన్నివేశం కూడా చూడలేదని అతనన్నాడు.. సంతోషం. అందుకే నన్ను అనలేక నా తనయుడ్ని టార్గెట్ చేశాడు. తనికి తెలియని విషయం ఏంటంటే.. 'మీర్జాపూర్' సిరీస్‌లో నా తనయుడు నటించలేదు. దర్శకుడు కూడా కాదు. వేరేవాళ్లతో నిర్మించాడు. ప్రజాస్వామ్య దేశంలో నచ్చినట్టు సినిమాలు తీసుకునే హక్కు అందరిదీ. ఇంకో రెండుమూడు 'యానిమల్స్'ని తీయమనండి... నాకెందుకు.' అంటూ స్ట్రాంగ్ రిప్లయ్ ఇచ్చారు జావెద్. మరి దీనిపై సందీప్ స్పందనేంటో చూడాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.